
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024



ప్రమాదాలకు పేరుగాంచిన మొగిలి ఘాట్ రోడ్డు ఈసారి ఏడుగురిని బలి తీసుకుంది. ఆర్టీసీ బస్సును అదుపు తప్పిన ఐరన్ లోడ్ లారీ ఢీ కొట్టడం.. వెనుక నుంచి గ్రానైట్ లోడ్‌తో వస్తున్న మరో లారీ ఢీకొనడంతో బస్సు నుజ్జునుజ్జయింది. తిరుమల దర్శనం తర్వాత సొంత ప్రాంతాలకు బస్సులో బయల్దేరిన వారిలో కొందరు అర్థాంతరంగా తనువు చాలించారు. 31 మంది క్షతగాత్రులుగా ఆస్పత్రులపాలయ్యారు.

మొగిలి ఘాట్‌లో మరణ మృదంగం

హన్సిక మృతదేహాన్ని తరలిస్తున్న మొగిలివాసి గోపి

- రెండు లారీల మధ్య నుజ్జయిన ఆర్టీసీ బస్సు
- బస్సు, లారీ డ్రైవర్, ఐదుగురు ప్రయాణికుల దుర్మరణం
- 31మందికి గాయాలు
- సీఎం చంద్రబాబు, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

బంగారుపాళ్యం/చిత్తూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం 3గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి ఐరన్ లోడ్‌తో వస్తోన్న 20 టైర్ల లారీ మొగిలి ఘాట్‌లో అదుపు తప్పింది. డివైడర్ దాటి పక్క రోడ్డులోకి వెళ్లిపోయి తిరుమల నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగాన వేగంగా ఢీకొంది. దీంతో బస్సు ఒక్కసారిగా వెనుదిరిగింది. అదే సమయంలో ఆ బస్సు వెనుక వస్తున్న గ్రానైట్ లోడ్ లారీ బస్సును మరోసారి ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఐరన్ లోడ్ లారీ డ్రైవర్, బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఇద్దరితో పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృత్యువాత పడగా 8మందికి తీవ్ర గాయాలయ్యాయి.మొత్తం 31మంది గాయపడగా వీరిలో గ్రానైట్ లారీలోని వారు ముగ్గురున్నారు.వీరందరినీ తొలుత పలమనేరు ఏరియా ఆస్పత్రికి పంపించి చికిత్స అందించాక ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

సహాయక చర్యల్లో స్థానికులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్ మనోహర్ సీటులో నుంచి ఎగిరిపడి లారీ కమ్మీల మధ్య చిక్కుకుని మృతి చెందారు. సీట్ల మధ్యలో ఇరుక్కుపోయిన కండక్టర్ చిరంజీవిని వెలికి తీయడానికి సుమారు గంట పట్టింది. గునపాలతో, రాడ్లతో నిగ్గదీసి స్థానికులు, అధికారులు ఆయన్ను వెలికితీసి 108అంబులెన్స్‌లో చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పూతలపట్టు మండలంలోని చిటిపిరాళ్ల గ్రామం ఈయన సొంతూరు. ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతదేహం కమ్మీల కింద ఇరుక్కోవడంతో పోలీసులు, స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో కమ్మీలను పక్కకు జరిపి వెలికితీశారు. బస్సులో నుంచి కింద ఎగిరిపడ్డ ఓ బాలిక మృతదేహాన్ని మొగిలికి చెందిన గోపి రెండు చేతుల్లో తీసుకుని అంబులెన్సులోకి ఎక్కించారు. మొగిలిలోని శ్రీని ఫుడ్స్ ఫ్యాక్టరీ మేనేజర్ తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఏడు మృతదేహాలను వెలికితీసి ఆస్పత్రికి తరలించడానికి సుమారు గంటన్నర సమయం పట్టింది.

క్షతగాత్రుల వివరాలివే

పలమనేరు, సెప్టెంబరు 13 : మొగిలిఘాట్ ప్రమాదంలో 31 మంది గాయపడ్డారు. వీరిలో 20 మంది తీవ్రంగా గాయపడగా 11మంది స్వల్పంగా గాయపడ్డారు.క్షతగాత్రులైన శివ(27), రిక్కి(36), చిరంజీవి(45), బాబురెడ్డి(45), మురళి(35), అస్మిత్‌యాదవ్(3), పద్మావతి(54), లావణ్య(23), జి. అమరనాథ్(40), మంజు(50), సక్కుబాయ్(73), విష్ణు(29), కళ్యాణ్(26), సీహెచ్ వెంకటేశ్(35), ఎ.ఎన్. శ్రీనివాస్(6), శ్రీధర్(48), రుతిక్ (7), నేతాజి(33), వెంకటరమణ (24), ఎ. అక్రమ్(28), ముబారక్(27), కృష్ణ(38), జాస్మిన్‌మాలతి(33), బేబీ ఆఫ్‌జాస్మిన్ మాలతి(2), సురేష్(5), రితిక(44), రక్షిత(15), చిరంజీవి(36), విష్ణు(25), భాస్కర్‌రెడ్డి(55), ప్రశాంత్‌కుమార్(45)లను చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.వీరిలో ప్రాథమిక చికిత్సానంతరం ఆందోళనకరంగా ఉన్న 8 మంది శివ, రిక్కి, చిరంజీవి, బాబురెడ్డి,మురళి, అస్మిత్‌యాదవ్, పద్మావతి, లావణ్యలను తదుపరి చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదస్థలికి కలెక్టర్, ఎస్పీ

ప్రమాదం జరిగిన వెంటనే బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుల్ని అంబులెన్సుల్లో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాసేపటికే కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీటీసీ నిరంజన్‌రెడ్డి,డీఎస్పీ డేగల ప్రభాకర్ తదితరులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. మృతదేహాలను కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

● ట్రాఫిక్ మళ్లింపు

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సును క్రేన్లను తెప్పించి సుమారు గంట సేపు ప్రయత్నించి వెలికి తీశారు. చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారి కావడంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి.ఈ ప్రమాద కారణంగా రెండు లారీలు, ఓ బస్సు రోడ్డు మీద ఉండిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఓ వైపునకు మళ్లించారు.

మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం

సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు తెలుసుకుని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

మృతుల వివరాలు

- మనోహరన్ (56), తిరుపతిలోని అలిపిరి ఆర్టీసీ డిపో డ్రైవర్. తిరుపతిలోని సత్యనారాయణపురం నివాస ప్రాంతం.
- సోనుకుమార్ (31), ఐరన్ లోడ్‌తో వచ్చి ఢీకొన్న 20 టైర్ల లారీ డ్రైవర్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా ఖరిద్ ఖాజీపూర్ ప్రాంతం
- హన్సిక యాదవ్ (6), మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన అమ్మాయి. బస్సులో ప్రయాణిస్తోంది.
- బాలరాజు (55), తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాకు చెందిన వ్యక్తి
- విజయమ్మ (53), కంబాలమిట్ట,కావలి వారి పల్లె పంచాయతీ, పాకాల మండలం. బెంగళూరులో వుంటోన్న కుమార్తె వద్దకు బస్సులో వెళుతోంది.
- శంకరరెడ్డి (50), ఎస్‌ఎస్ కొండ, జీడీనెల్లూరు మండలం
- కులసాంబి(55), టిన్‌ఫ్యాక్టరీ, బెంగళూరుకు చెందిన మహిళ.



కుమార్తె దగ్గరకు వెళుతూ మృతి చెందిన విజయమ్మ (ఫైల్ ఫొటో)

కూతురు చనిపోయిందని తెలియకనే....

మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన ఆరేళ్ల హన్సిక ప్రమాద స్థలంలోనే చనిపోయింది.తల్లిదండ్రులు రిక్కీ, అషతోష్,మూడేళ్ల తమ్ముడు అష్మిత్ యాదవ్‌లతో కలిసి బస్సులో ప్రయాణించిన ఆమె మృతదేహం ఇప్పుడు చిత్తూరు ఆస్పత్రిలోని మార్చురీలో ఉంది.ముగ్గురు కుటుంబ సభ్యులకు ఆమె చనిపోయిన విషయాన్ని చెప్పకుండా అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



అషతోష్‌ను ఓదారుస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

● లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ డ్రైవర్ సోనుకుమార్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనుకుమార్‌కు మొగిలి ఘాట్ మీద అవగాహన లేకపోవడంతో పాటు నిద్రమత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. లారీ అదుపు తప్పడంతోనే డివైడర్ దాటి మరీ అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఆ డ్రైవర్ నిర్లక్ష్యం అతనితో పాటు మరో ఆరుగురి ప్రాణాలు బలి తీసుకుంది. చాలామందిని క్షతగాత్రుల్ని చేసింది.





గజ వాహనంపై ఏకదంతుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13: కాణిపాక వరసిద్ధి వినాయకుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. కాణిపాకానికి చెందిన వన్నియ నాయకర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేసి,భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో గజ వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాల నడుమ కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వరుడి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో తదితరులు

ముక్కంటీశుడి తరపున పట్టువస్త్రాలు

శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయం తరపున పట్టువస్త్రాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో ఎస్‌వీవీఎస్ మూర్తి తదితరులు కలిసి కాణిపాకానికి తీసుకొచ్చారు. ఆలయ అతిథి గృహం వద్ద వీరికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, వరసిద్ధుడి ఆలయ ఈవో గురుప్రసాద్ స్వాగతం పలికి, పట్టువస్త్రాలను తీసుకొచ్చి అర్చకులకు అందించారు.

కాణిపాకంలో నేడు

శనివారం స్వామికి రథోత్సవాన్ని(తేరు) నిర్వహించనున్నారు.కాకర్లవారిపల్లెకు కీర్తిశేషులు ఎతిరాజులునాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ వీఎం కె.పూర్ణచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిప్రసాద్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు

రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో గురుప్రాద్ తెలిపారు. ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, అరటి బోదెలతో అలంకరించినట్లు తెలిపారు. ఉత్సవానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో వారు ఇబ్బంది పడకుండా స్వామి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

డ్వామా పీడీ, జడ్పీ సీఈవో బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు13:జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ రాజశేఖర్‌ను మాతృశాఖ అయిన రెవెన్యూకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.సార్వత్రిక ఎన్నిక -2024విధుల కోసం డీఆర్వోగా ఉన్న రాజశేఖర్‌ను డ్వామా పీడీగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం అన్నిశాఖల్లో కొనసాగుతున్న బదిలీల నేపథ్యంలో డ్వామా పీడీ రాజశేఖర్‌ను, జడ్పీ సీఈవో గ్లోరియాను బదిలీ చేశారు. వారిద్దరి స్థానంలో ప్రత్యామ్నాయ అధికారులను నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నలుగురు డ్వామా పీడీలను, నలుగురు జడ్పీ సీఈవోలను వారి మాతృశాఖ అయిన రెవెన్యూశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

రూ.వంద కోట్ల రుణాలివ్వాలన్నదే లక్ష్యం

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు



మీడియాతో మాట్లాడుతున్న చలసాని రాఘవేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13: జిల్లాలో ఈ ఏడాది అన్ని వర్గాల ప్రజలకు రూ.వంద కోట్ల మేరకు రుణాలను ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని విశాఖపట్నం కో- ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే 52 బ్రాంచీలతో బ్యాకింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ఆదివారం చిత్తూరులో తమ 53వ బ్రాంచ్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తాము రూ.425441 కోట్ల డిపాజిట్లు సేకరించామన్నారు. రూ.332235 కోట్లు రుణాలుగా వితరణ చేశామన్నారు. బ్యాంకు పరిధిలో 107850 మంది ఖాతాదారులతో రూ.36989 కోట్ల షేర్ ధనం కలిగి ఉందన్నారు. ఇటీవల ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదిక మేరకు గత ఆర్థికసంవత్సరం దేశంలోని అన్ని అర్బన్ బ్యాంకుల్లో మొదటి 15వ స్థానంలో తమ బ్యాంకు నిలిచిందన్నారు. షేర్ ధనంలో జాతీయ స్థాయిలో మూడో స్థానం, డిపాజిట్ల సేకరణలో 15వ స్థానం, రుణ వితరణలో 14వ స్థానం. నికర లాభాల్లో 10వ స్థానంలో నిలిచిందని వివరించారు. గత ఏడాది రూ.87కోట్లు లాభాలు గడించగా అందులో రూ.39 కోట్లు డిపాజిటర్లకు డివిడెండ్ రూపంలో చెల్లించామన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు సత్యనారాయణమూర్తి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, చిత్తూరు బ్రాంచి సీఈవో వరలక్ష్మి, మేనేజర్ సురేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, సీపీఐ నేత జనార్దన్ పాల్గొన్నారు.

17 నుంచి 21వ తేదీలోపు బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ఈనెల 22వ తేదీవరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వరదల బీభత్సం సృష్టించడం, ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నం కావడంతో మూడోసారి బదిలీల గడువును పొడిగించాల్సి వచ్చింది. తొలుత ఆగస్టు 31వ తేదీలోపు బదిలీలను పూర్తి చేయాలని సంకల్పించారు. అప్పట్లో సామాజిక పింఛన్ల పంపిణీ, విస్తారంగా వర్షాలు కురవడంతో ఇబ్బందులు తలెత్తాయి, దీంతో ఈనెల 15వ తేదీవరకు రెండోసారి పొడిగించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బదిలీల ప్రక్రియను 22వ తేదీ వరకు పొడిగించాలని నిర్ణయం తీసుకోవడంతో ఆయా విభాగాల ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమైంది. ఇక రెండో శనివారం, ఆదివారం, సోమవారం సెలవులు వచ్చాయి. దీంతో ఈనెల 17 నుంచి 21వ తేదీలోపు బదిలీలు జరగడానికి వీలుంది. ఇప్పటికే కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా.. మిగిలిన శాఖలు సైతం కసరత్తు మొదలుపెట్టాయి.

కోలాహలంగా 'బొజ్జ గణపయ్య' నిమజ్జనోత్సవం

● 4లక్షల 11 రూపాయలకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్న చిత్తూరు ఎమ్మెల్యే





డీఐ రోడ్డులో శివశక్తి వినాయక నిమజ్జనంలో స్వామివారి ఊరేగింపు - లడ్డూ ప్రసాదంతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, దొరబాబు తదితరులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13: చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో ఏర్పాటు చేసిన ఐదు గణేశుడి ప్రతిమలను శుక్రవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశక్తి వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని 4లక్షల 11 రూపాయలకు ఎమ్మెల్యే దక్కించుకున్నారు. ఈయన తరఫున మాజీ కార్పొరేటర్ వసంతనాయుడు వేలం పాట పాడారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు ఎమ్మెల్యే పంచి పెట్టారు. అనంతరం ఐదు వినాయక ప్రతిమలను మేళతాళాలు, బాణసంచా వేడుకలతో ఊరేగిస్తూ కట్టమంచి చెరువు వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కఠారి హేమలత, దొరబాబుల తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కళాకారుల సందడి

తెలుగు భాష ఆయన శ్వాస

● స.వెం. రమేశ్‌కు నేడు బొమ్మిడాల పురస్కారం



ఆయన పుట్టి పెరిగింది తమిళనాట. కానీ జన్మమూలాల అమ్మభాష అయిన తెలుగే శ్వాసగా తపిస్తున్నారు. భాషా రాష్ట్రాల పేరుతో తెలుగు భాష, సంస్కృతులకు కలిగిన ముప్పును వివరిస్తూ, కాపాడుకుందామంటూ ఉద్యమకారుడిగా అలుపెరగని ప్రయాణం సాగిస్తున్నారు. ఎల్లలకు ఆవల ఉన్న తెలుగుదనాన్ని లోకానికి చాటుతున్నారు. తెలుగు పరిశోధకుడిగా దేశదేశాలు పర్యటిస్తున్నారు స.వెం.రమేశ్. ఆయన చేస్తున్న విశేష కృషికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీకాళహస్తి కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం తెలుగు భాషోద్యమం నడుపుతున్న స.వెం.రమేశ్‌కు గుంటూరులో నేటి సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో బొమ్మిడాల పురస్కారం అందజేస్తారు.

గురువు పుష్పరాజ్ సహా ఏడుగురితో ఏర్పడిన తెలుగువాణి సంస్థ ద్వారా స.వెం.రమేశ్ తమిళనాడులోని వేలూరు ప్రాంతంలో తెలుగు తరగతులను ప్రారంభించారు. అనేక తెలుగు పల్లెల్లో తిరిగి తెలుగు రాయడం చదవడం నేర్పించారు. వేలూరు పరిసరాల్లోని 80 గ్రామాల్లో నాలుగు వేల మంది తెలుగు నేర్చుకున్నారు. వారిలో కొందరు తెలుగులో కథారచయితలుగా, కవులుగా మారారు. ఆ తరువాత కంచి, హోసూరు, తిరవళ్లూరు తదితర ప్రాంతాల్లో తెలుగు ఉద్యమాన్ని నడిపించి అక్కడి భాషాభిమానుల్లో ఉత్తేజం నింపారు. ఇక ప్రపంచ నలుమూలల్లోని తెలుగువారి మూలాల కోసం ఆయన అన్వేషణ కొనసాగింది. శ్రీలంక దేశంలో పాములు, కోతులు ఆడించే రెండు తెగల ప్రజలు తెలుగువారు ఉన్నట్లు గుర్తించి వారి దగ్గరకు వెళ్లి వారి జీవన సంస్కృతులు అధ్యయనం చేశారు. వారి తెలుగు మూలాలు వెలుగులోకి తెచ్చారు. అలాగే బంగ్లాదేశ్‌లోని వందలాది మారుమూల పల్లెల్లో సుమారు 6.5లక్షల మంది తెలుగువారు ఉన్న విషయం వెలుగులోకి తెచ్చారు. ఇక అమెరికా, మలేసియా, మారిషస్ దేశాల్లో కూడా ఆయన పర్యటించి తెలుగు భాషపై లోతైన పరిశోధన చేశారు. 200 ఏళ్ల క్రితం మలేషియాలో స్థిరపడ్డ తెలుగువారు నేటికీ గెంతు, దాటు భజనలు, కోలాటాలు, బుర్రకథలు పదిలంగా కాపాడుకోవడం గుర్తించారు. రచయితగానూ ఆయన రాసిన పుస్తకాలు అచ్చతెలుగు అక్షరాలతో అల్లిన పరిమళ దండలు. భాషాభిమానులను ఎంతగానో పెనవేసుకున్నాయి. ఇందులో ప్రధానంగా పులికాట్ తీర ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'ప్రళయ కావేరి కతలు' పుస్తకం, 'కతల గంప' విశేషంగా తెలుగు పాఠకులను ఆకట్టుకున్నాయి. 'ఎల'లు లేని తెలుగు' వ్యాసాల పుస్తకం, 'సజీవ సాంప్రదాయంగా వేమన' పరిశోధన పుస్తకం, వ్యాకరణంపై తెలుగు నుడికట్టు పుస్తకం స.వెం.రమేశ్ సాహిత్య, భాషా కృషిని వెల్లడిస్తాయి.

- శ్రీకాళహస్తి

కాన్సర్ బాధితుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం చేయూత



తిరుపతి(విద్య), సెప్టెంబరు 13:క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోలేక... రోజురోజుకూ మరణానికి దగ్గరౌతున్న ఓ యువకుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం ఆర్థికసాయం అందించింది. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన పందొమ్మిదేళ్ల యువకుడు కౌశిక్ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'దేవర సినిమాచూసి చచ్చిపోతా... అమ్మా అప్పటిదాకా బతికించండి' శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.స్పందించిన నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం వెబ్‌సైట్ ప్రతినిధులు బాధితుడి ఇంటికి చేరుకుని 40వేల రూపాయల నగదును కౌశిక్ తల్లిదండ్రులకు అందజేశారు. నందమూరి హీరోల అభిమానులు కొంతమంది నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం పేరున ఓ వెబ్‌సైట్‌ను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి వీరు ఆపన్న హస్తం అందిస్తున్నారు.ఈ క్రమంలో అనేకమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడం, పేదవారికి ఆర్థికసాయం అందించడం లాంటి సేవలు అందిస్తున్నారు.

నేడు జూనియర్ ఎన్టీఆర్ పరామర్శ

కౌశిక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హీరో జూనియర్ ఎన్టీఆర్ శనివారం అతడిని పరామర్శించనున్నారు.తిరుపతికి చెందిన తన అభిమాని కృష్ణయాదవ్‌కు ఫోన్ చేసి కౌశిక్ దగ్గరకు వెళ్లి తనతో ఫోన్లో మాట్లాడించమని చెప్పినట్లు సమాచారం.

16న మిలాద్ ఉన్ నబీ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13: మిలాద్ ఉన్ నబీ పండుగను ఈనెల 16వ తేదీన ముస్లింలు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తారు. అలాగే సోమ, మంగళవారాల్లో ప్రవక్త కేశాలను భక్తుల సందర్శనార్థం ఉంచనున్నారు. చిత్తూరు నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

నేటినుంచి పాఠశాలలకు మూడ్రోజుల సెలవులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి వరుసగా మూడ్రోజులపాటు పాఠశాలలకు సెలవులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కాగా, సోమవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అధికారిక సెలవు. దీంతో వరుస సెలవులు వచ్చినట్లయ్యింది.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 13: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. క్రిమినల్, సివిల్, బ్యాంకులు, ఇన్సూరెన్స్‌తోపాటు పలురకాల కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుపతి జిల్లాలోని 120 మంది సెబ్ ఉద్యోగులు నేటి నుంచి ఎక్సైజ్ శాఖ పరిధిలోకి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు శనివారం నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాలుగా మారనున్నాయి. అక్కడ పనిచేస్తున్న 12 మంది సీఐలు, మరో 12 మంది ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది మొత్తం 120 మంది మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఇక, సెబ్ స్టేషన్లు అద్దె భవనాల్లోనే వున్నాయి. వాటికి ఆరేడు నెలల అద్దె బకాయిలున్నాయి. భవన యజమానులు మళ్లీ అదే భవనాల్లో ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటుకు అంగీకరిస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది. ఇక, పోలీసు శాఖ నుంచి డెప్యుటేషన్‌పై సెబ్‌లో పనిచేస్తున్న అదనపు ఎస్పీ రాజేంద్ర మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయనకు ఇప్పటి వరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక, తడ వద్ద కొత్తగా ఎక్సైజ్ చెక్ పోస్టు ఏర్పాటు కానుంది. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, టాస్క్‌ఫోర్సు ఎన్‌ఫోర్సుమెంటు ఏసీ, మొబైల్ పార్టీలు ఏర్పాటు చేయనున్నారు.









మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు

మొగిలి ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13: మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరా తీసిన ఆయన సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న వైద్యసాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు సరైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబుతో పాటు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులను ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్ పరామర్శించారు.

క్షతగాత్రులకు అధికారుల పరామర్శ



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 13: మొగిలి ఘాట్ ప్రమాదంలో గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి పరామర్శించారు.మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు.గంటకు పైగా కలెక్టర్ ఆస్పత్రిలోనే వుండి చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి ధైర్యం చెప్పారు. ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఆయనతో పాటు చిత్తూరు ఇన్‌చార్జ్ డీపీటీవో రాము తదితరులున్నారు.

సాంకేతిక లోపాలతోనే మొగిలిఘాట్‌లో ప్రమాదాలు

పలమనేరు, సెప్టెంబరు13 : పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల సాంకేతిక లోపాలను గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మొగిలి ప్రమాదంలో గాయపడి పలమనేరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిని ఎస్పీ మణికంఠతో కలిసి పరామర్శించారు.అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మొగిలి ఘాట్ ప్రమాదాలకు నిలయంగా ఉందన్నారు.అక్కడ కొన్ని సాంకేతిక లోపాలున్నాయని, వీటిని జాతీయరహదారి అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సోదరి ఇంటికి వెళ్తూ గాయాలపాలు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 13: బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ ప్రమాదంలో ఎస్ఆర్‌పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన బుల్లెట్ బాబు (53) గాయపడ్డాడు. ఇతను బెంగళూరులోని తన అక్క ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో మొగిలి ఘాట్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆయన తలకు, కంటి దగ్గర గాయాలయ్యాయి. బాధితుడు చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గాయపడిన బుల్లెట్ బాబు

వైసీపీ ప్రభుత్వ తీరుతో పంచాయతీలు నిర్వీర్యం

కూటమి అధికారంలోకి వచ్చాక పటిష్ఠానికి చర్యలు ● పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: 'గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిధులు దారి మళ్లించింది. ఉపాధి హామీ నిధులు రూ.36 కోట్లను దుర్వినియోగం చేసింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన ఆగింది. పంచాయతీలు నిర్వీర్యమై.. సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకనే జగన్‌ను ఓడించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పంచాయతీలను బలోపేతం చేసేందుకు రూ.12.48 కోట్లను జమ చేసిందని గుర్తుచేశారు. ఉపాధిహామీ పనులకు రూ.9వేల కోట్లను జమ చేసి.. ఊరూరా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు ఏమేమి చేపట్టాలో మీరే నిర్ణయించుకోండంటూ పంచాయతీలకు నిర్ణయాధికారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిన గ్రామీణ వ్యవస్థను, స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం బాగుచేసి జవసత్వాలు కల్పించాలని ఆయన కోరారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్, సింగంశెట్టి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబు రాజేంద్రప్రసాద్

పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13: పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాకాల స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కొత్త రైల్వే కోచ్ డిపో ఏర్పాటు చేయాలని, ఆధునికీకరించాలని ప్రతిపాదనలను కేంద్ర రైల్వేశాఖ మంత్రికి తాను సమర్పించానన్నారు. తన విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ.. పాకాల రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాల్లో ఎనిమిదిలైన్ల రైల్వేమార్గంతోపాటు కొత్త రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు ఈ నెల 9న నిర్వహించిన సేఫ్టీ మీటింగ్‌లో సూత్రపాయంగా ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.







శ్రీకాళహస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్ల ఊరేగింపు

ముక్కంటి ఆలయంలో ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించి మూల విరాట్లకు పునరుత్తేజానికి ఈ పూజలను నిర్వహిస్తు న్నారు. ఐదురోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో తొలిరోజు దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి జరిగాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి, ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్, టీడీపీ నాయకుడు చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

పుంగనూరు నుంచి విజయవాడకు ఆర్టీసీ సర్వీసు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు13: పుంగనూరు నుంచి విజయవాడకు ఈనెల 16వ తేది నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నట్లు పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పుంగనూరు నుంచి మదనపల్లె, కడప, కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు నడుస్తున్న ఆర్టీసీ సర్వీసుకు తక్కువ ఆదాయం వస్తుండటంతో ఆ బస్సు సర్వీసును రద్దు చేశామన్నారు. ఆ సర్వీసుకు బదులుగా పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, కల్లూరు, పీలేరు, తిరుపతి మీదుగా విజయవాడకు బస్సు వేస్తున్నామని పేర్కొన్నారు. 16 నుంచి ప్రతిరోజు పుంగనూరు నుంచి విజయవాడకు సాయంత్రం 5-10 గంటలకు బయలుదేరి మళ్లీ అదే సర్వీసు విజయవాడలో సాయంత్రం7-45 గంటలకు వస్తుందని, రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆయన తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా పోటీల్లో సూరయ్యగారిపల్లె విద్యార్థుల ప్రతిభ



సోమల, సెప్టెంబరు 13: సోమల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన మండల స్థాయి క్రీడాపోటీల్లో సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలురు, బాలికల విభాగాల్లో ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలోని వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. విద్యార్థులను ఎంఈవో శివరత్నమ్మ, హెచ్ఎం నిరంజన్ కుమార్, పీడీ శివకుమార్, సూర్యప్రకాశ్, ఏపీ రెడ్డి, కుసుమ, విద్యావతి, చంద్రకళ తదితరులు అభినందించారు.

పాతపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

కల్లూరు, సెప్టెంబర్ 13: పులిచెర్ల మండలం పాతపేటలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. మూడు రోజుల క్రితం గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామానికి చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు ప్రజలు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఈ తాగునీటి సమస్యపై ప్రజలు పంచాయతీ కార్యదర్శి చిరంజీవి దృష్టికి తీసుకెళ్లారు. మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని కార్యదర్శి తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

రొంపిచెర్ల, సెప్టెంబరు13: మండలంలో జ్వరాలు వ్యాప్తి చెందకుండా పరసరాల పరిశుభ్రత, దోమల నివారణ ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారి దినేష్‌కుమార్‌నాయక్, హెచ్ఈ రాజేశ్వరి కోరారు. రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆరోగ్యకార్యకర్తలకు సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ మురుగునీటి కాలువలో సైనోవియల్ ద్రావణం, బీటీఐ పౌడర్, అబిట్ వంటి మందులు వేయాలన్నారు. ఈసమావేశంలో సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

దుకాణాలకు కొత్త విద్యుత్తు మీటర్లు

కుప్పం, సెప్టెంబరు 13: కుప్పం డివిజన్‌లోని వ్యాపార సముదాయాలు, దుకాణాలకు సరికొత్త మీటర్లను ఏర్పాటు చేయడానికి రెస్కో ఉద్యుక్తమైంది. వ్యాపార దుకాణాల్లో చాలా యేళ్లుగా ఉన్న విద్యుత్తు మీటర్లే వినియోగంలో ఉన్నాయి. వీటిలో చాలా వరకు తప్పుడు రీడింగ్ చూపిస్తున్నాయి. రెస్కో సిబ్బంది లాలూచీ వ్యవహారాల వల్ల అసలు రీడింగుకంటే తక్కువ రీడింగ్ చూపిస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో బిల్లులు తక్కువ వచ్చి రెస్కోకు ఆమేరకు నష్టం వాటిల్లుతోంది. దీన్ని గుర్తించిన రెస్కో ఎండీ సోమశేఖర్ తప్పుడు రీడింగ్‌లు చూపుతున్న మీటర్లను మార్చడానికి నిర్ణయించుకున్నారు. సరికొత్త మీటర్లను తెప్పించారు. మొదటి విడతలో 5 వేల మీటర్లు రెస్కోకు చేరాయి. వీటిలో ఇప్పటికే సుమారు 200 దాకా మీటర్లను పాత మీటర్ల స్థానంలో దుకాణాలకు బిగించారు. ఈ మీటర్లు అయిపోతే రెండో విడతలో మరిన్ని మీటర్లను తెప్పించేందుకు రెస్కో సిద్ధంగా ఉంది. ఇలా తప్పుడు రీడింగ్ చూపుతున్న పాత మీటర్ల స్థానంలో కొత్త మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల రూ.లక్షల్లో బిల్లులు పెరిగి, ఆమేరకు ఆదాయం వస్తుందని రెస్కో అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 : పట్టణంలోని హెచ్‌వీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మొదట సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మ భనవ నిర్మాణానికి స్థలం కేటాయించండి

పలమనేరు, సెప్టెంబరు13 : పలమనేరు ప్రాంతంలో కమ్మభవనం నిర్మాణానికి కావలసిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి స్థానిక కమ్మసంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అమరనాథరెడ్డికి పూలమాల వేసి సన్మానించారు. స్థలం కేటాయింపుపై అధికారులతో సంప్రదించి సహకరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్మ సామాజిక నాయకులు జగదీష్‌నాయుడు, హేమంత్‌నాయుడు, భూపతినాయుడు, సీతాపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 : బైరెడ్డిపల్లె బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ నిమజ్జన కార్యక్రమం శుక్రవారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయక ప్రతిమను ట్రాక్టర్‌లో కొలువుదీర్చి డప్పువాయిద్యాలు, యువకులు కాషాయజెండాలు చేతపట్టి కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



చౌడేపల్లె, సెప్టెంబర్13:గణేష్ నిమజ్జనం ఘనంగా మండల ప్రజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక బస్టాండులోని నాయుడు కోటర్స్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడుని ట్రాక్టర్‌పై అధిష్టింప చేసి బల్లారి డ్రమ్స్ మధ్య ఊరేగించి, భక్తులకు ప్రసాదాలు పంపిణి చేశారు. సాయంత్రం చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

రాళ్లబూదుగూరులో గణనాథుడి ఊరేగింపు



శాంతిపురం, సెప్టెంబర్ 13 : రాళ్లబూదుగూరు బీసీ కాలనీలో శుక్రవారం గణనాథుడి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఏడు రోజులుపాటు గ్రామంలో అన్నదానం చేశారు. క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి లడ్డును వేలం పాటలో లోకేష్ అనే వ్యక్తి రూ.71వేలకు దక్కించుకున్నారు. అనంతరం భారీ వినాయకుడిని లారీలో ఉంచి ఊరేగిస్తూ రాళ్లబూదుగూరు చెరువులో నిమజ్జనం చేశారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యేల పరామర్శ

పలమనేరు, సెప్టెంబరు13 : పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొగిలి ఘాట్ రోడ్డు ప్రమాద బాధితులను శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి పరామర్శించారు. ఎమ్మెల్యేలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎం డాక్టర్ శారద బాధితులకు అందించిన సేవలను వివరించారు. ప్రమాదకరంగా ఉన్న ఏడుగురిని తదుపరి చికిత్సకోసం చిత్తూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. బాధితులకు మెరుగైన చికిత్సలు అందించాలని వారు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను కోరారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

రేపు కంటి పరీక్ష శిబిరం

కుప్పం, సెప్టెంబరు 13: సాయిమాత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం ఉచిత మెగా కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కుప్పం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఈ శిబిరంలో బెంగళూరు శంకర కంటి కంటి ఆసుపత్రి నుంచి కంటి వైద్య నిపుణులు సిబ్బందితో కంటి పరీక్షలు నిర్వహించి, కొటి పొర ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, సెప్టెంబరు13: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచెర్ల, సెప్టెంబరు13: పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతూ బడి మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈవోలు శ్రీనివాసులు, ఇందిర అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో వెలుగు, విద్యా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్‌స్కూల్‌లో చేరడానికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలన్నారు. అడ్మిషన్ ఫీజ్ జనరల్ కేటగిరి పురుషులకు రూ1400, మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు రూ. 1100 చెల్లించాలన్నారు. సమావేశంలో వెలుగు సీసీ వెంకటనారాయణస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, మహ్మద్‌అలీ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులకు సన్మానం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు13 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల, పెద్దచెల్లారగుంట ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషాప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. అలాగే హిందీ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు నసీబ్‌జాన్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

సోమల, సెప్టెంబరు 13: ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో యూటీఎఫ్ ముందడుగు వేస్తుందని ఆ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ జీసీకే. ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కందూరు హైస్కూల్‌లో యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులను కలసి తమ శాఖలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మాజీ కౌన్సిలర్ షకీల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీపతి, ఎస్‌వీ. రమణ, హరినాథ్, రాజశేఖర్, జనార్థన్ పాల్గొన్నారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్



చౌడేపల్లె, సెప్టెంబర్ 13: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ఐ స్కూల్ గేమ్స్ శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. ఎంఈవో కేశవరెడ్డి మాట్లాడుతూ..మండలంలోని 9 హైస్కూల్స్ నుంచి 300 మంది విద్యార్థులతో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజరెడ్డి, స్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుధాకర్, పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, సుధాకర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, సెప్టెంబర్13: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

వైష్ణవీదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, సెప్టెంబర్13: పుదిపట్లలో వెలసిన స్వయంభు వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మురుగు కాలువలలో పూడికతీత

కుప్పం, సెప్టెంబరు 13: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేపట్టారు. పారిశుధ్య కార్మికులను పెద్దయెత్తున ఈ పనికి నియోగించి పూడికను వెలికి తీశారు. అలాగే కాలువలకు అడ్డుగా ఉన్న పొదలను పొక్లయినర్లను పెట్టి తీయించారు.

ఉపాధిలో పారదర్శకతకు ప్రాధాన్యం

రూ.90592 రికవరీకి డ్వామా పీడీ ఆదేశం



ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ

కల్లూరు, సెప్టెంబర్ 13: జాతీయ ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. పులిచెర్లలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2024 వరకు ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 2196 పనులకు సంబంధించి రూ. 14,58,56,025 వ్యయం చేశారు. ఇందులో కూలీలతో చేసిన పనులకు రూ. 9,00,79,661, వివిధ అభివృద్ధి పనులకు రూ. 5,57,76,364 వెచ్చించారు. గత నెల 30 నుంచి ఈ నెల 12వ తేది వరకు గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ సిబ్బంది పనులను పరిశీలించి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆ గ్రామసభల్లో తయారుచేసిన నివేదికలను బహిరంగసభలో తనిఖీ సిబ్బంది చదివి వినిపించారు. సంబంధిత పనుల వివరాలను పంచాయతీల వారీగా అధికారులు సమీక్షించారు. ఈ తనిఖీలో రూ.90592లను రికవరీకి పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి గంగాభవాని, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏపీవో షౌకత్ ఆలీ, జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, సర్పంచ్ రాణెమ్మ, జేఈ క్రిష్ణయ్య, టీఏలు మోహన్‌బాబు, కీర్తి, మహేంద్ర, జ్యోతీశ్వర్‌రెడ్డి, ఏఈలు గౌతమి, త్యాగరాజన్, ఎస్ఆర్‌పీ మల్లికార్జున, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, వెంకటరమణ, ధనంజయనాయుడు, రమేష్, నాగరాజనాయుడు, మహేష్, గోవర్ధన్, నజీర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

పుంగనూరు రూరల్, సెప్టెంబరు13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పుంగనూరులో కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు నిరసన చేపట్టారు. శుక్రవారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా బిల్లులు తీసుకురావడానికి బీజేపీ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అయూబ్, అల్తాఫ్, ఇమ్రాన్, ముబారక్, ఫయాజ్, ఫైరోజ్, సుహేల్, సాదిక్, అక్బర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో నిరసన వ్యక్తంచేస్తున్న కాంగ్రెస్ మైనార్టీ నాయకులు

కృషి, పట్టుదల ఉంటే బంగారు భవిష్యత్తు

శాంతిపురం, సెప్టెంబర్ 13 : క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, దీంతో యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని గుడపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.రామకృష్ణమనాయుడు అన్నారు. శుక్రవారం శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువత దుర అలవాట్లకు లోనుకాకుండా సక్రమ మార్గంలో గడపాలన్నారు. అనంతరం క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే బదిలీపై వెళ్లిన అధ్యాపకురాలు మాధవిని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ విజయకుమార్, రామకుప్పం కళాశాల ప్రిన్సిపాల్ చాణక్య, శాంతిపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజ్‌రెడ్డి, అధ్యాపకులు రాజేష్‌కుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సావిత్రమ్మ, రామమూర్తి, మధు, విజయలక్ష్మి, మంజునాథ్, శ్రీనివాసులు, రజనీకాంత్, నాగలక్ష్మి, చాముండేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు

రెండు బైక్‌ల ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

శాంతిపురం, సెప్టెంబర్ 13: శాంతిపురం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రామకుప్పం మండలానికి చెందిన సుబ్రమణ్యం శాంతిపురం మండలం మొరసనపల్లె పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేయడానికి శాంతిపురం సమీపం బాలాజీ కళ్యాణ మండపం పక్కన ఉన్న హోటల్‌కు వెళ్లాడు. భోజనం తినేసి తిరిగి మండల సచివాలయం వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా, గుడుపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన నరేష్ ద్విచక్రవాహనంలో వస్తూ సుబ్రమణ్యం ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన సుబ్రమణ్యం, నరేష్‌లను స్థానికులు 108 అంబులెన్స్‌లో కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు.





తీవ్రంగా గాయపడిన సుబ్రమణ్యం, చికిత్స పొందుతున్న శెట్టిపల్లె నరేష్

రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

శాంతిపురం, సెప్టెంబర్ 13 : అసంపూర్తిగా ఉన్న గృహాలను అక్టోబర్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో కుమార్ సూచించారు. శుక్రవారం దండికుప్పం పంచాయతీ నల్లరాళ్లపల్లె హౌసింగ్ కాలనీని ఎంపీడీవో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు రాలేదని కొంతమంది, తమ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని మరి కొందరు తెలిపారు. త్వరగా బిల్లులు వచ్చేందుకు చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో లబ్ధిదారులకు తెలిపారు. తరువాత ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మండలంలో 650 ఫారం పాండ్‌లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అర్హత కలిగిన చిన్న సన్నకారు రైతులు ఫారం పాండ్‌లు చేసుకోవచ్చాన్నారు. ఒక్కొక్క ఫారం పాండ్ విలువ రూ.62,081 అని, ఇందులో కూలీలకు రూ. 41,081 పోగా, మెటీరియల్‌కు రూ. 21,000లు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరినాథ్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ ఏఈ పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

హౌసింగ్ దరఖాస్తులే అధికం



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 13: కుప్పం పురపాలక సంఘంలో నిర్వహిస్తున్న వార్డు ముంగిటికి మున్సిపాలిటీ కార్యక్రమంలో ప్రజలనుంచి వివిధ సమస్యలపై అధికారులకు వినతులు అందుతున్నాయి. అయితే వీటిలో పక్కా ఇళ్ల మంజూరుకోసం వస్తున్న వినతులే అధికంగా ఉంటున్నాయి. పురపాలక సంఘం 8వ వార్డు పరిధిలోని చీలేపల్లె, సలార్లపల్లె, పరమసముద్రం తదితర ప్రాంతాలలో శుక్రవారం వార్డు ముంగిటికి మున్సిపల్ అధికారులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్తు స్తంభాలు, రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సమస్యల గురించి వినతులు ప్రజలనుంచి అందాయి. హౌసింగ్ వినతులు ఎక్కువగా ఉన్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, టీడీపీ నాయకులు జాకిర్, మురుగేశ్, ప్రజా ప్రతినిధులు, పురపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ నేర్చుకుంటే విరివిగా ఉపాధి అవకాశాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు13: హిందీ భాష నేర్చుకోవడం వల్ల రైల్వే, బ్యాంకింగ్, ఆర్మీ, నేవీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటాయని పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆ కాలేజీలో హిందీభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందీ భాషకు ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హిందీ భాషపై వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ అధ్యాపకురాలు స్రవంతి, శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

కొలమాసనపల్లిలో...

పలమనేరు : పలమనేరు మండలం కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీదివస్ నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, ముంతాజ్‌లు హిందీ నేర్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటు

పలమనేరు, సెప్టెంబరు13 : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సీపీఎం పార్టీకే కాక దేశానికి కూడా తీరని లోటు అని పలమనేరులో సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం సీతారాంఏచూరి మృతిచెందడంతో శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, ఈశ్వర్, మునిరాజులు, సావిత్రి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి రొంపిచెర్ల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులు అర్పించారు. విద్యావేత్త డాక్టరు రఘునాథ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం జరిగే ప్రతి పోరాటంలో తనవంతుగా చేయూతనించే వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేశు, నరేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం: ఎస్ఈ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 13: అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యంగా పనిచేయాలని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వాట్సాప్ నెంబరు 94408 14283 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సూర్యఘర్ సోలార్‌పై వినియోగదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు, వినియోగదారులకు సోలార్ విద్యుత్ వాడకంపై వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. ఈపథకం ద్వారా వినియోగదారులు, రైతులు ఉచిత విద్యుత్‌ను పొందవచ్చన్నారు. వ్యవసాయ సర్వీసుదారులు నాణ్యమైన విద్యుత్ పొందాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎంసీబీ పెట్టించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు మొదలయ్యాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈలు మునిచంద్ర, డీఈలు శేషాద్రి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

తవణంపల్లె, సెప్టెంబరు 13: కారు ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. తవణంపల్లె పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నత్తపసేను గ్రామానికి చెందిన లేట్ జగన్నాథరెడ్డి భార్య చిట్టెమ్మ(65) పొలం వద్ద నుంచి ఇంటికి వెళ్లడానికి బెంగళూరు-తిరుపతి హైవేపై వస్తుండగా తిరుపతి నుంచి బెంగళూరువైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తవణంపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొగిలి ఘాట్‌లో ప్రమాదం బాధాకరం

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13: మొగిలి ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మరణించిన వారి ఆత్మకు శాంతికలగాలని, కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. ఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, పోలీసులు, వైద్య సిబ్బంది ఇతర అధికారులు వెంటనే చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో చాలామందికి ప్రాణహాని తప్పిందని చెప్పారు. క్షతగాత్రులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు.

ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధికి సహకరించండి

మంత్రికి ఎమ్మెల్యే వినతి



మంత్రితో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు 13: నగరి ఏరియా, పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. ఈ మేరకు అమరావతిలో శుక్రవారం మంత్రి సత్యకుమార్‌ని కలిసి విన్నవించారు. ఇందుకోసం అవసరమైన నిధులను మంజూరు చేయించాలన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

విజయపురం, సెప్టెంబరు 13: కళియంబాకం పంచాయతీ మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు హరినాథ్ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయన మృతదేహానికి టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు పూలమాల వేసి, నివాళి అర్పించారు. పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మేల్‌మరవత్తూరు అమ్మవారికి పూజలు



అంబళ్లు తీసుకొస్తున్న మహిళలు

పాలసముద్రం, సెప్టెంబరు 13: మండల కేంద్రం కాలనీలోని మేల్ మరవత్తూరు అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి మహిళలు అంబళ్లు సమర్పించారు. దుష్టశక్తులనుంచి తమ గ్రామాన్ని రక్షించాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

పాలసముద్రం, సెప్టెంబరు 13: శ్రీకావేరిరాజుపురంలో శుక్రవారం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవాలు నిర్వహించారు. ఏఎన్ఎం రేవతి మాట్లాడుతూ.. తాజా ఆకుకూరలు, చిరు ధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను ఉపయోగించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, గాయత్రి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 13: కార్వేటినగరం ద్రౌపది అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం పూజలు, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు జరిపించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి హరిబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాబ్ మేళాతో 59 మందికి ఉద్యోగాలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 13: కార్వేటినగరంలో శుక్రవారం ఐటీఐ ఆవరణంలో జరిగిన జాబ్ మేళాలో 98 మంది హాజరై 59 మంది ఉద్యోగ అవకాశాలు పొందారని ఐటీఐ ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. వివిధ కంపెనీలు హాజరై జాబ్ మేళా నిర్వహించాయన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం మృతికి టీడీపీ నివాళి

వెదురుకుప్పం, సెప్టెంబరు 13: కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట నివాసి రిటైర్డ్ హెచ్ఎం, గ్రామ దేవత ఆలయ పురోహితుడు వెంకటరమణ(65) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. ఆ సమాచారం అందుకున్న కార్వేటినగరం టీడీపీ అధ్యక్షుడు చెంగ్రాలయయాదవ్, తెలుగు రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు, సీనియర్ నాయకులు హేమాద్రి అక్కడికి చేరుకుని మృత దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై గ్రామసభ

వెదురుకుప్పం, సెప్టెంబరు 13: వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై శుక్రవారం వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో సర్పంచ్ బండి శశిఆనందరెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సమస్యలపై చర్చించారు. డీడీవో ధనలక్ష్మి, ఉపసర్పంచ్ పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఐరాల, సెప్టెంబరు 13: చంద్రయ్యగారిపల్లెలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంటివైద్య శిబిరాన్ని రోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వాహకుడు జె.మల్లయ్యనాయుడు కోరారు. చెన్నైకి చెందిన మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, శంకర్ నేత్రాలయ వారి సౌజన్యంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఎస్‌లో సెక్టోరియల్ పోస్టుల

భర్తీకి నోటిఫికేషన్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 13: జిల్లా సమగ్ర శిక్ష (ఎస్ఎస్)లో ఖాళీలుగా ఏర్పడిన సెక్టోరియల్, సహాయ సెక్టోరియల్ పోస్టులకు కలెక్టర్ సమిత్ కుమార్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్, సహిత విద్య కోఆర్డినేటర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. తొలి రెండు పోస్టులకు స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం 8 సంవత్సరాల సర్వీసు, అసిస్టెంట్ సీఎంవోకు కనీసం 5 సంవత్సరాలు సర్వీసు కలిగి ఉండాలి. వీటితోపాటు 55 సంవత్సరాలు మించని, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అర్హత కలిగిన టీచర్లు పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 23వ తేదీలోపు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

నగరి, సెప్టెంబరు 13: నగరి బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పలువురు నాయకులు శుక్రవారం ఘన నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, కోదండయ్య, పెరుమాళ్, వేలన్, బాషా, విజయన్, గోవిందస్వామి పలువురు సీపీఐ, సీపీఎం, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, సెప్టెంబరు 13: కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం డీఎంపురంకు చెందిన భీమారావు, లోకేశ్వరి దంపతులు అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు ఇచ్చారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

పూతలపట్టు, సెప్టెంబరు 13: పూతలపట్టు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మణి, ఉపాధ్యక్షుడిగా హేమకుమార్, కార్యదర్శిగా రమణ, జాయింట్ సెక్రటరీగా కిరణ్, కోశాధికారిగా శేఖర్ ఎన్నికయ్యారు.







కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆస్థాన మండపంలో కళాకారిణుల నృత్య ప్రదర్శన, ఉత్సవ విగ్రహాలకు హారతి ఇస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్

వరసిద్ధుడి రథం తిరిగే ప్రదేశాల్లో పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న ఆలయ ఈవో, ఈఈ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13: కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వినాయక స్వామి రథం తిరిగే ప్రదేశాలను ఆలయ ఈవో గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ పరిశీలించారు. రథం తిరిగే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దుకాణాలను వెనక్కు జరిపించారు. అలాగే ఈ ప్రాంతంలో శనివారం భక్తులు, గ్రామస్తులు ఎవ్వరు కాని తమ వాహనాలను అడ్డంగా ఉంచరాదని చెప్పారు. కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, కాణిపాకం ఎస్ఐ ధరణిదర్, కార్యదర్శి సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎమ్మెల్యేలు



అమరనాథరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం పలమనేరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్వామిని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ కూడా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఆలయ ఏసీ మల్లికార్జున, వరసిద్ధుడి ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, నాగభూషణం, మాజీ చైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.



వడ్డిబోయరాజులకు వస్త్రాల బహూకరణ

రథోత్సవంలో రథాన్ని తోసే వడ్డిబోయరాజులకు శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్‌లు వస్త్రాలను బహూకరించారు. ఏటా రథోత్సవం ముందు రోజు వస్త్రాలను అందించడం ఆలయ సంప్రదాయం.

ఎన్నికల వరకే రాజకీయాలు

- ఐరాల మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం
- పూతలపట్టు ఎమ్మెల్యే పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న మురళీమోహన్

ఐరాల, సెప్టెంబరు 13: 'ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం. టీడీపీ కూటమి, వైసీపీ నాయకులు, కార్యకర్తలందరం కలసి ఐరాల మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం' అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐరాల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. హౌసింగ్ ఏఈ వాసు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయంలో 1128 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరవగా, 22 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయని చెప్పారు. దీనికింద ప్రజాధనం రూ.30 కోట్లు వృథా అయిందని, ఇకపై నిజమైన లబ్ధిదారులకు స్థలాలు, ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గుండ్లపల్లె ఎంపీటీసీ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గుండ్లపల్లె పరిధిలో సబ్ సెంటర్ శిథిలావస్థలో ఉందన్నారు. అన్ని సబ్‌సెంటర్లపై దృష్టి పెట్టాలని డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. అలాగే తేలు కుట్టి ఓ మహిళ ఐరాల ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందడం ఏంటని, మందులు లేవా అని డాక్టర్‌ను ప్రశ్నించారు. అడవి తేలు కుట్టిందని బాధితురాలిని ఆస్పత్రికి తీసుకురావడం ఆలస్యమవడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు వైద్యుడు వివరించారు. ఏ పార్టీ వారికైనా సమస్య ఉంటే తాను కచ్చితంగా పరిష్కరిస్తానని స్పష్టం చేవారు. అనంతరం సభ్యులందరినీ కాణిపాకం బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.







విజయలక్ష్మి అలంకరణలో దేశమ్మతల్లి - రాజరాజేశ్వరి అలంకరణలో ఓరుగంటాలమ్మ - కళాకారుల సందడి

వైభవంగా గ్రామదేవతల ఊరేగింపు

నగరి, సెప్టెంబరు 13: నగరి గంగజాతరను పురస్కరించుకుని చివరి రోజైన శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు గ్రామదేవతలు ఓరుగంటాలమ్మ, దేశమ్మ దేవతల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ వేపాకు మందిరం నుంచి అక్కచెల్లెళ్లు ఓరుగంటాలమ్మ, దేశమ్మ దేవతల ఊరేగింపు ప్రారంభమైంది. విచిత్ర వేషాలతో పలువురు అలరించారు. వానియంబాడి డ్రమ్స్, రాజమండ్రివారి కోయడాన్స్, కర్ణాటక వీరభద్రం వీరగ్రాసం నాట్యాలు, బాణాసంచా పేలుళ్లు, యువత కేరింతల మధ్య అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటా మహిళలు మంగళహారతులు పట్టి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కు చెల్లించారు.

ఇసుక టిప్పర్ సీజ్



గుడిపాల, సెప్టెంబరు 13: మండలంలో అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలం ఎన్.ఆర్.పేట రీచ్ నుంచి తమిళనాడుకు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో తమిళనాడు బార్డర్ అయిన నంగమంగళం వద్ద ఇసుక టిప్పర్‌ను సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'ఇసుక అక్రమంగా అమ్ముకుంటున్నారు'

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13: ఐరాల మండలంలో ఇసుకను అక్రమంగా అమ్ముకుంటున్నారని దళిత సంఘాల నేతలు ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐరాల మండలం,మొరంపల్లె రెవెన్యూ పరిధిలోని రామవనంతోపు వాగు పొరంబోకులో ఉన్న ఇసుకను జయచంద్రారెడ్డి అనే వ్యక్తి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గతంలో పనిచేసిన తహసీల్దారు వరలక్ష్మి వాగు పొరంబోకు భూమిలో ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డుకూడా ఏర్పాటు చేశారని చెప్పారు. అయినా జయచంద్రారెడ్డి ఇసుకను అక్రమంగా తరలించి, డంప్‌చేసి విక్రయించి లక్షలు సంపాదిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై ప్రస్తుత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, దళిత సంఘం నేతలు మునస్వామి, దామోదరం, ఉదయ్‌కుమార్, భానుచందర్, వినాయకం, ప్రసాద్, రమేష్, బుల్లెట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'కార్వేటినగరం ఎఫ్ఆర్వోపై చర్యలు తీసుకోవాలి'

వెదురుకుప్పం, సెప్టెంబరు 13: 'వన్య ప్రాణులను, వృక్ష సంపదను రక్షించాల్సిన కార్వేటినగరం ఎఫ్ఆర్వో వెంకటసుబ్బయ్య పనితీరు, వ్యవహార శైలి చట్ట వ్యతిరేకంగా ఉంది. ఆయనపై వెంటనే చర్యలు చేపట్టి, విచారణ కొనసాగించాలి' అని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం శుక్రవారం డిమాండ్ చేశారు. కార్వేటినగరం అటవీశాఖ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. కార్వేటినగరం కుప్పగానిగుంట వద్ద గురువారం నాలుగు అడవి పందులు చనిపోతే వాటిని పోస్టుమార్టం నిర్వహించకుండా చట్టప్రకారం అనుసరించాల్సిన నియమ నిబంధనలను పాటించలేదన్నారు. తాము అడిగితే ఒక పంది చనిపోయిందని చెప్పి, పోస్టుమార్టం నిర్వహించామని, ఆ తర్వాత ఖననం చేసినట్లు చెప్పారని చెప్పారు. కానీ, పశువైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదిస్తే తమ దృష్టికి రాలేదని, పోస్టుమార్టం చేయలేదన్నారు. దీన్నిబట్టి చూస్తే ఎఫ్ఆర్వో పొంతనలేని విధంగా చెప్పి తప్పుదోవ పట్టించారని చెప్పారు. ఇదే విషయమై జిల్లా అటవీశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎఫ్ఆర్వోను తక్షణమే సస్పెండ్ చేయకపోతే కార్వేటినగరం అటవీశాఖ కార్యాలయం వద్ద తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ప్రభుత్వ భూమిలో ఉన్న పంటను వేలం వేయాలి

కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె రెవెన్యూ లెక్కదాఖలాల్లో 3.78 ఎకరాల ప్రభుత్వ భూమిని లోకనాథరెడ్డి ఆక్రమించుకుని సాగుచేశారని కొత్తపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కబ్జా భూమిలో చెరకు పంట ఉందని, ఆ పంటను వేలం పాట నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆ గ్రామ రైతులతో కలసి కలెక్టర్, నగరి ఆర్డీవోను కలసి విన్నవించామన్నారు. పంటను కాపాడాల్సిన బాధ్యత కూడా కార్వేటినగరం తహసీల్దార్‌దే అన్నారు. ఒకవేళ లోకనాథరెడ్డి కానీ ఇతరులు ఎవరైనా పంటను సొమ్ము చేసుకుంటే తహసీల్దార్ జీతం నుంచి ఆ పంట విలువ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలసి తహసీల్దార్ పనితీరుపై ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



పేరు మార్చండయ్యా?

వెదురుకుప్పం,సెప్టెంబరు 13: ప్రభుత్వ ఆదేశాలు వచ్చినా క్షేత్రస్థాయిలో ఇంకా కదలికలు లేవు. ప్రభుత్వ కార్యాలయాల పేర్ల మార్పులో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా కూటమి ప్రభుత్వం మార్చింది. కానీ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పలు చోట్ల ఇంకా రైతు సేవా కేంద్రంగా బోర్డులు మార్చలేదు. కార్వేటినగరం, వెదురుకుప్పం, పెనుమూరు, గంగాధరనెల్లూరు, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాల్లో ఇప్పటికీ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రగానే ఈ భవనాలు దర్శనమిస్తున్నాయి.

వరద బాధితులకు రూ.30లక్షల వస్త్ర కిట్ల పంపిణీ



వెదురుకుప్పం, సెప్టెంబరు 13: విజయవాడ నగరంలోని రాజరాజేశ్వరి పేటలో నాలుగు వేల వరద బాధిత కుటుంబాలకు రూ.30లక్షల వస్త్ర కిట్లను శుక్రవారం పంపిణీ చేశామని బెంగళూరులో స్థిరపడ్డ ప్రవాసాంధ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు కె.ఎతిరాజులు నాయుడు, కె.మురళీబాబు, భీమనేని సురేష్, ప్రభు, పూర్ణచంద్ర, ఎం.సుబ్రహ్మణ్యంనాయుడు, ప్రత్యూష్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, వై.ప్రసాద్, వి.మంజునాథ్, బండి రాజేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. తామంతా గంగాధరనెల్లూరు నియోజకవర్గ మండలాలకు చెందిన వారమని తెలిపారు.



- వరద బాధితుల కోసం విశ్రాంత ఉపాధ్యాయురాలు తవణంపల్లె మండలం దిగువ మాఘం గ్రామానికి చెందిన ఎస్ మొగిలమ్మ రూ.51 వేల చెక్కును తిరుపతి కలెక్టర్‌కు అందజేశారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న శైలజామూర్తి

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 13: విద్యార్థులు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ పెంచుకోవాలని విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి అన్నారు. శుక్రవారం విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, 21వ శతాబ్దపు యోగ్యతలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నేటి సాంకేతిక యుగంలో విద్యార్థి వ్యక్తిగత ఎదుగుదలకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ కె.గోపి, అపోలో యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫసర్ ఎస్.ఫిరోజ్ బేగం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఝాన్సీ, థమీమ్ పాల్గొన్నారు.

'ఎన్‌పీఎస్'లో హిందీ దివస్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 13: ఎన్‌పీ సావిత్రమ్మ (ఎన్‌పీఎస్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన శుక్రవారం హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా బొమ్మసముద్రం కళాశాల స్వర్ణోత్సవాలు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు

గుడిపాల, సెప్టెంబరు 13: బొమ్మసముద్రం కళాశాల 50 ఏళ్లు పూర్తిచేసుకోవడంతో శుక్రవారం స్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జడ్పీ వైస్‌చైర్ పర్సన్ రమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ కళాశాలలో చదివి ఉన్నతస్థాయిలో వున్న పూర్వవిద్యార్థులు కళాశాలకు కొంత ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కూడా సన్మానించారు. అనంతరం కళాశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు, సైన్సుల్యాబ్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి, మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ శరత్చంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు చెన్నకేశవులు నాయుడు, బాలాజి నాయుడు, ధనసింగ్, నాగరాజ్ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, వినోద్ యాదవ్, బోడెబ్బ నాయుడు, హరి నాయుడు, పళని, మురళీనాయుడు, మహిళా నాయకురాలు పద్మ, జనసేన నాయకుడు రూప్‌కుమార్, బీజేపీ నాయకుడు ధనంజయ నాయుడు, దయారాం తదితరులు పాల్గొన్నారు.

దిగువకామినేనిపల్లెలో 'గణపతి' నిమజ్జనం



ఐరాల, సెప్టెంబరు 13: మండలంలోని దిగువకామినేనిపల్లెలో శుక్రవారం గణపతి ప్రతిమ నిమజ్జనాన్ని గ్రామానికి చెందిన యువకులు నిర్వహించారు. సాయంత్రం యువకులు గ్రామంలో ఉట్టి కొట్టి, రంగులు చల్లుకున్నారు. అనంతరం స్వామికి పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి నిమజ్జనం చేశారు.